62

# దేవుడు "ఏర్పరచుకొనిన" ప్రజలు

## (యెషయా 65)

ప్రజలు చేసిన ప్రార్థనలకు ప్రత్యుత్తరముగా, దేవుడు పైపై విషయాల కంటే ఎక్కువ ప్రాముఖ్యమైన అంశాలతో వ్యవహరించాడు; ఆయన వారి సమస్యలకు గల అసలు కారణాన్నే కనుగొన్నాడు. నిశ్చయంగా, వారిని రక్షించుటకు దేవుడు సమర్థుడై యుండుట యేగాక ఆయన అందుకు ఇష్టపడుచుండినవాడునై యుండెను, కానీ వారి వేషధారణనుబట్టియే ఆయన కృపాతిశయము పరిమితము చేయబడినది. వారు మతపరంగా దైవభక్తి గలవారై యుండినప్పటికిని, వారు దేవుని ఆరాధించు విషయంలో ఆయన చిత్తమునకు వ్యతిరేకమైన సమస్త విధములైన చెడు అలవాట్లను మరియు చర్యలను అభ్యసించుచుండిరి. ఇటువంటి చర్యలతో వారు దేవునిని తమకిష్టమువచ్చినట్లుగా ఉపయోగించుకొనజాలరని వారునేర్చుకొనవలసి యుండినది. యూదా దేశములోని ప్రజలందరును దేవుని ప్రజలు కారనియు అబ్రాహాము యొక్క శారీరక సంబంధమైన సంతానమునకు చెందనివారు అందులో చేరియుండు ఒక ఆధ్యాత్మిక ఇశ్రాయేలు కొరకు ఆయన ప్రణాళిక వేయుచుండెనని కూడ వారు నేర్చుకొనవలసి వచ్చింది.

### జనములకును ఆయన ప్రజలకును మధ్య గల తారతమ్యమును దేవుడు చూపించుచున్నాడు (65:1-7)

#### ఆయన జనములను సమీపించుచున్నాడు (65:1)

నా యొద్ద విచారణ చేయనివారిని నా దర్శనమునకు
రానిచ్చితిని
నన్ను వెదకనివారికి నేను దొరికితిని.
-నేనున్నాను ఇదిగో నేనున్నాను అని నా పేరు
పెట్టబడని జనముతో చెప్పుచున్నాను

మొదటి వచనము యొక్క సరైన భాష్యము అధ్యాయమంతటికి అవసరమైయున్న భావమును నిశ్చయించుచున్నది. "ఆయన యొద్ద విచారణచేయని జనముచేత" "ఆయన వెదకబడునట్లును" ఆయనను వెదకనివారికి "దొరుకునట్లును" దేవుడు తానే అనుమతించాడు. ఇది యూదాను సూచించుటలేదు, ఏలయనగా దేవుని యొద్ద విచారణచేయుచుండినవారు యూదాలో ఎల్లప్పుడు ఉండిరి. దానికి బదులుగా, పౌలు రోమీయులకు 10:12-20లో బహు బలముగా నొక్కివక్కాణించినట్లు, ఇది అన్యజనుల గూర్చిన ఒక ప్రస్తాపనయైయున్నది. అపొస్తలుడైన పౌలు ఆయన బోధించుచుండిన సత్యము సరిగా అర్థంచేసికొనబడునట్లు ఈ వాక్యభాగమును యెషయా గ్రంథంలో నుండి తీసికొని ఉల్లేఖించి చెప్పాడు (వచనాలు 20).
వారు ఆయన ప్రజలైయున్నారను విషయాన్ని ఆధారం చేసికొని యూదా దేశప్రజలు

దురవస్థను ఎదుర్కొనుచుండిన సమయంలో వారు దేవునిని విన్నవించుకొన్నారు. అయితే ఆయన వారిని తృణీకరించుచున్నాడు కానీ ఆయనను వేదకని ప్రజలు ఆయనను కనుగొందురని ఇందుకు ఆయనిచ్చిన జవాబు నొక్కివక్కాణించుచున్నది. శరీరక సంబంధమునుబట్టి (అబ్రాహాము సంతానమై యున్నందున) వారు ఇక ఎన్నటికిని అంగీకరింపబడరు. వాస్తవంగా చెప్పుకొంటే, దేవుని చేత అంగీకరింపబడినవారమై యుండుటకు ఎన్నడునూ ఈ ఒక్క విషయమే మూలాధారమై యుండలేదు. అది ఎల్లప్పుడును విశ్వాసము ద్వారా ఏర్పడు సంబంధముపై – అబ్రాహాము కలిగియుండినటువంటి విశ్వాసముపై – ఆధారపడి యుంటున్నది. పౌలు ఈ విధంగా వ్రాయుచున్నాడు,

> అబ్రాహాము దేవుని నమ్మెను అది అతనికి నీతిగా యెంచబడెను. కాబట్టి విశ్వాససంబంధులే అబ్రాహాము కుమారులని మీరు తెలిసికొనుడి. దేవుడు విశ్వాసమూలముగా అన్యజనులను నీతిమంతులుగా తీర్చునని లేఖనము ముందుగాచూచి – నీయందు అన్యజనులందరును ఆశీర్వదింపబడుదురు అని అబ్రాహామునకు సువార్తను ముందుగా ప్రకటించెను. కాబట్టి విశ్వాససంబంధులే విశ్వాసముగల అబ్రాహాముతో కూడ ఆశీర్వదింపబడుదురు (గలతీయులకు 3:6–9).

అబ్రాహామునకు వలెనే, విశ్వాసమునుబట్టి అన్యజనులు నీతిమంతులుగా తీర్చబడుదురు.

**ఆయన తన ప్రజల పాపములను ఎరుగును (65:2–7)**

యూదుల వైఖరి, దేవునిని విశ్వాసముతో వెదకిన అన్యజనుల వైఖరికి బొత్తిగా వ్యత్యాసమైనదై యున్నది. తదుపరి వ్రాయబడియున్న వచనములలో దేవుడు ఆయన ఏర్పరచుకొన్న ప్రజల పాపములను లెక్కించాడు.

> తమ ఆలోచనల ననుసరించి చెడుమార్గమున నడచు కొనుచు
> లోబడనొల్లని ప్రజలవైపు దినమంతయు నా చేతులు
> చాపుచున్నాను.
> వారు తోటలలో బల్యర్పణమును అర్పించుచు ఇటికెల
> మీద ధూపము వేయుదురు
> నా భయములేక నాకు నిత్యము కోపము కలుగజేయుచున్నారు.
> వారు సమాధులలో కూర్చుండుచు రహస్యస్థలములలో
> ప్రవేశించుచు పందిమాంసము తినుచుందురు
> అసహ్యపాకములు వారి పాత్రలలో ఉన్నవి
> వారు– మా దాపునకురావద్దు ఎడముగా ఉండుము
> నీకంటె మేము పరిశుద్ధులమని చెప్పుదురు;
> వీరు నా నాసికారంధ్రములకు పొగవలెను
> దినమంతయు మండుచుండు అగ్నివలెను ఉన్నారు.
> యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు
> –నా యెదుట గ్రంథములో అది వ్రాయబడియున్నది
> ప్రతికారము చేయక నేను మౌనముగా నుండను
> నిశ్చయముగా వారనుభవించునట్లు నేను వారికి ప్రతి
> కారము చేసెదను.
> నిశ్చయముగా మీ దోశములనుబట్టియు మీ పితరుల

దోషములనుబట్టియు
అనగా పర్వతములమీద ఈ జనులు ధూపమువేసిన
దానినిబట్టియు
కొండలమీద నన్ను దూషించినదానినిబట్టియు
మొట్ట మొదట వారి ఒడిలోనే
వారికి ప్రతికారము కొలిచి పోయుదును.

"తమ ఆలోచనల ననుసరించి చెడుమార్గమున నడచుకొనుచు, లోబడనొల్లని ప్రజలవైపు, దినమంతయు నా చేతులు చాపుచున్నాను" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 2). ఇదే పరిస్థితి 55:6–9లో ప్రస్తావింపబడి యున్నది. దేవుడు ఏర్పరచుకొనిన ప్రజలు వారి సొంత ప్రణాళికలను అనుసరించుటకు ఆయన మార్గములను మరియు ఆలోచనలను ఎల్లప్పుడు తృణీకరించారు. వారి జీవితాల్లో దేవుడే సింహాసనాసీనుడై యుండునట్లు చేసికొనుటకు బదులుగా వారు తమ్మునుతామే సింహాసనాసీనులుగా చేసికొన్నారు. న్యాయాధిపతుల కాలములో, "ప్రతివాడును తన తన ఇష్టానుసారముగా ప్రవర్తించుచుండిన కాలములో" సహితము విదితమైయుండిన తిరుగుబాటుతనము యొక్క సారాంశము యిదే (న్యాయాధిపతులు 17:6; 21:25 చూడుము).

దేవుడు ఇశ్రాయేలు గూర్చి చెప్పుచు, "నా భయములేక నాకు నిత్యము కోపము కలుగజేయుచున్నారు" అని పలుకుచున్నాడు (వచనం 3ఎ). తదుపరి మూడు వచనాల్లో, ఇశ్రాయేలీయులు దేవుని కోపమును రెచ్చగొట్టిన కొన్ని పరిస్థితులను ఆయన నిర్దిష్టముగా పేర్కొన్నాడు. మొదటిదిగా, "వారు తోటలలో బల్యర్పణమును అర్పించుచు ఇటికెల మీద దూపము వేయుదురు" అని పేర్కొన్నాడు (వచనం 3బి). "తోటలు" అనగా "బల్యర్పణల" కొరకు అధికారపూర్వకంగా అనుమతి ఇయ్యబడని స్థలములై యున్నవి. "ఇటికెలు" అనగా "ధూపము" వేయుటకు అధికారపూర్వకంగా అనుమతించబడని సామగ్రియై యున్నది.[1]

రెండవదిగా, ప్రజల గూర్చి చెప్పుచూ ఆయన, "వారు సమాధులలో కూర్చుండుచు రహస్యస్థలములలో ప్రవేశించుచుందురు" అని పలుకుచున్నాడు (వచనం 4ఎ). దేవుడు చిల్లంగితనమును (అనగా, మరణించినవారి ఆత్మలతో సంభాషించుటకు చేయబడు ఏ ప్రయత్నమైనను; ద్వితీయోపదేశకాండము 18:9–11; యెషయా 8:19, 20 చూడుము). నిక్కచ్చిగా నిషేధించాడు. ఈ పద్ధతి దేవుడు కాని వేరొక మూలము నుండి సహజాతీతమైన ప్రత్యక్షతను సంపాదించుకొనుటకు చేయబడిన ఒక ప్రయత్నమై యుండినది. "పందిమాంసమును తినుచుండి అసహ్యపాకములు వారి పాత్రలలో ఉంచుకొనుట" వలన కూడ ప్రజలు దేవుని ఉగ్రతకు గురయ్యారు (వచనం 4బి). పందిమాంసము లేదా ఇతరమైనది అపవిత్రమైన మాంసమును తినుట కచ్చితంగా నిషేధింపబడినది (లేవీయకాండము 11:4–8 చూడుము).

మూడవదిగా, "మా దాపునకు రావద్దు, ఎడముగా ఉండుము, నీకంటె మేము పరిశుద్ధులము" అని చెప్పుటకు ప్రజలు ఉన్ముఖులైయుండిరని దేవుడు గమనించాడు (వచనం 5ఎ). పేర్కొనబడిన కార్యకలాపములనుబట్టి అపరాధ భావము కలిగియుండిన ఈ ఆరాధికులు ఇతరుల కంటే వారే ఎక్కువ పరిశుద్ధులని తమ్మునుతాము పరిగణించుకొన్నారు! "నేను" అను సమస్యతోకూడిన మాటలు పలికిన పరిసయ్యుని వలెనే (లూకా 18:11, 12), వారు ఒక

రకమైన ఆధ్యాత్మిక శ్రేష్ఠులని స్వాధికారంతో చెప్పుకొన్నారు. "వీరు నా నాసికారంధ్రములకు పొగవలె ఉన్నారు" అని దేవుడు సెలవిచ్చాడు (వచనం 5బి). దేవుడు వారికి నేర్పించుచున్న పాఠము మనకు కూడ వర్తిస్తుంది: వినయముతో కూడిన విధేయతోగాక ఇతరమైన ఏ విధముగానైనను దేవుని దాసులై యున్నారని స్వాధికారంతో చెప్పుకొను ఎవరైనను వారు కేవలము దేవునికి బాధను కలిగించువారై యున్నారు.

వారి పరిశుద్ధతనుబట్టి పొగడ్తలను ఆశించువారిని ప్రస్తావిస్తూ, "వారు తమ ఫలము పొందియున్నారు" అని యేసు సెలవిచ్చాడు (మత్తయి 6:2, 5, 16) – కానీ వారు అపేక్షించుచుండిన దానిని వారు పొందుకొనరు. యూదా ప్రజలు అగుపర్చిన అవిధేయతనుబట్టి దేవుడు వారిని ప్రశంసించుటకు బదులుగా వారికి ప్రతీకారమును ప్రతిఫలముగా ఇచ్చును (వచనం 6). "నిశ్చయముగా వారి దోషములును వారి పితరుల దోషములును" వారు ఎట్టి కొలతతో కొలవబడవలెనో నిశ్చయించును (వచనం 7ఎ). యూదాలోని ఈ తరమువారు, ఇదివరకటి తరము వలెనే, దేవుని తిరస్కరించుచు "పర్వతముల మీద ధూపము వేసిరి" (వచనం 7బి). దోషము ఒక తరము నుండి తరువాతి తరమునకు ఎదుగుచుండు ప్రక్రియ స్వభావము కలిగియున్నది. అయితే ఇది నిజమైయుండ నవసరములేదు (యెహెజ్కేలు 18:14–18 చూడుము); కానీ తిరుగుబాటుదారులైన తండ్రుల నుండి కుమారులు విడిపోతే తప్ప, రెండు తరములవారు సహితము తీవ్రమైన పరిణామములను ఎదుర్కొనవలసి యుండును.

## దేవుని వాగ్దానము: చర్య చేపట్టును (65:8–16)

### ఆయన తన దాసుల పక్షముగా చర్య తీసికొనును (65:8–10)

> యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు
> –ద్రాక్షగెలలో క్రొత్తరసము కనబడునప్పుడు
> జనులు – అది దీవెనకరమైనది దాని కొట్టివేయకుము
> అని చెప్పుదురు గదా?
> నా సేవకులనందరిని నేను నశింపజేయకుండునట్లు
> వారినిబట్టి నేనాలాగే చేసెదను.
> యాకోబునుండి సంతానమును యూదానుండి నా
> పర్వతములను స్వాధీనపరచుకొనువారిని పుట్టించెదను
> నేను ఏర్పరచుకొనినవారు దాని స్వతంత్రించుకొందురు
> నా సేవకులు అక్కడ నివసించెదరు.
> నన్ను గూర్చి విచారణచేసిన నా ప్రజలనిమిత్తము
> షారోను గొఱ్ఱెల మేతభూమియగును
> ఆకోరు లోయ పశువులు పరుండు స్థలముగా ఉండును.

మంచి ద్రాక్షా గెలలు ధారాళమైన ద్రాక్షరసమును ఉత్పన్నము చేయునట్లు సేద్యము చేయబడు రీతిలోనే దేవుడు "తన సేవకుల పక్షాన చర్య చేపట్టును" (వచనం 8). నీతిమంతమైన శేషము గూర్చిన ఇతివృత్తము ఈ గ్రంథమందంతటను గమనించబడింది. ఇక్కడ, దేవుడు, "యాకోబు నుండి సంతానమును, యూదా నుండి నా పర్వతములను

స్వాధీనపరచుకొనువారిని పుట్టించెదను" అని సెలవిచ్చుచున్నాడు (వచనం 9). దేశ బహిష్కృతులు గావింపబడి చెరగా పట్టబడినవారు డెబ్బది వర్షముల తరువాత వారి పితరుల దేశమునకు తిరిగి వచ్చెదరని ఆయన ఆ తరువాత వాగ్దానంచేసాడు (యిర్మీయా 25:11, 12; 2 దినవృత్తాంతములు 36:21 చూడుము). "షారోను" (వచనం 10) మధ్యధరా సముద్ర ప్రాంతములో కర్మెలు పర్వతమునకును యొప్పేకును మధ్య సారవంతమైన సమభూమియై యుండెను. దీనికి తారతమ్యముగా, యెరికో నుండి యెరూషలేము దిశగా నుండిన "ఆకోరు లోయ" దాదాపు బీడుభూమియైనది. ఆకాను పాపము చేసినది మొదలుకొని (యెహొషువ 7), ఈ లోయ ఇశ్రాయేలు విషయంలో "చెడగొట్టబడిన ఒక ఉజ్వలమైన ఆరంభమునకు" ప్రతీకయై యుండినది.[2] దేశమంతయు ఒక దీవెన పొందుకొనునని చెప్పుటకు సారవంతమైన సమభూమి మరియు నిర్మానుష్యమైన ఈ లోయయు ఎన్నుకొనబడినవి. ఏదిఏమైనా, ఈ దీవెనను ఇశ్రాయేలు దేశమంతయును పొందుకొనదు. దేవుడు ఇట్టి సౌభాగ్య సమృద్ధిని "ఆయన నన్ను గూర్చి విచారణచేసిన ఆయన నా ప్రజలనిమిత్తము" మాత్రమే అనుగ్రహించును.

## అవిధేయులపై ఆయన చర్య తీసికొనును (65:11, 12)

యెహోవాను విసర్జించి నా పరిశుద్ధపర్వతమును మరచి
గాదునకు బల్లను సిద్ధపరచువారలారా,
అదృష్టదేవికి పానీయార్పణము నర్పించువారలారా,
నేను పిలువగా మీరు ఉత్తరమియ్యలేదు
నేను మాటలాడగా మీరు ఆలకింపక నా దృష్టికి
    చెడ్డదైనదాని చేసితిరి
నాకిష్టము కానిదాని కోరితిరి
నేను ఖడ్గమును మీకు అదృష్టముగా నియమించుదును
మీరందరు వధకు లోనగుదురు.

యెహోవాను వెదకనందువలన కలుగు ఫలితాన్ని 11వ వచనం తెలియజేయుచున్నది. "అదృష్టము" (*gad*) దేశ బహిష్కరణకు పూర్వపు దినముల యందు విస్తృతముగా ఆరాధింపబడిన సిరియా దేశము దేవతయై యుండెను.[3] "విధి(రాత)" (*meni*) కూడా ఒక అన్యమతారాధికుల దేవతయై యుండెను, కానీ దాని మూలమేమిటో తెలియదు.[4] దేవుని అరాధించు విషయంలో రాజీ కుదురుట అసంభవము. ఒకరు దేవున్నైనా ఆరాధిస్తారు లేదా విగ్రహారాధనా సంక్షోభంలోనైనా చిక్కుకొనిపోతారు. యూదాలో చేసికొనబడిన తప్పుడు ఎంపికలకు "ఖడ్గము" మరియు "వధ" (వచనం 12ఎ) ఫలితములైయుండినవి. ప్రజలు దేవుని పిలుపును లక్ష్యపెట్టలేదు. వారు "చెడ్డదైనదాని చేసారు, (దేవునికి) ఇష్టము కానిదాని కోరారు" (వచనం 12బి).

## ఆయన వారిని రెండు తరగతులవారిగా విభజించుచున్నాడు (65:13–16)

కావున ప్రభువగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు
–ఆలకించుడి నా సేవకులు భోజనముచేయుదురు
    గాని మీరు ఆకలిగొనెదరు
నా సేవకులు పానము చేసెదరు గాని మీరు దప్పిగొనెదరు.

నా సేవకులు హృదయానందముచేత కేకలు వేసెదరుగాని
మీరు చింతాక్రాంతులై యేడ్చెదరు
మనోదుఃఖముచేత ప్రలాపించెదరు.
నేనేర్పరచుకొనినవారికి మీ పేరు శాపవచనముగా
    చేసిపోయెదరు
ప్రభువగు యెహోవా నిన్ను హతముచేయును
ఆయన తన సేవకులకు వేరొక పేరు పెట్టును.
దేశములో తనకు ఆశీర్వాదము కలుగవలెనని కోరు
    వాడు నమ్మదగిన దేవుడు తన్నాశీర్వదింపవలెనని
    కోరుకొనును
దేశములో ప్రమాణము చేయువాడు నమ్మదగిన దేవుని
    తోడని ప్రమాణము చేయును
పూర్వము కలిగిన బాధలు నా దృష్టికి మరువబడును
అవి నా దృష్టికి మరుగవును.

"కావున" (వచనం 13) అను పదము దీవెనలు మరియు శిక్షకులకు సంబంధించిన బెదిరింపుల గూర్చి అదివరకే ఇవ్వబడిన వాగ్దానముల ఆధారంగా తుది అభిప్రాయములను పరిచయము చేయుచున్నది. "యెహోవా ఈలాగు సెవవిచ్చుచున్నాడు" అను మాటలు ఇట్టి ఘోషణలు చేయుచున్నది సార్వభౌముడైన దేవుడే అని నొక్కివక్కాణించుచున్నవి. "నా సేవకుల"కును అవిధేయులైనవారికిని మధ్య గల తీక్షణమైన తారతమ్యములు బయటపడుచున్నవి. "ఆయన తన సేవకులకు వేరొక పేరు పెట్టును" అని దేవుడు మరొకసారి చెప్పుచున్నాడు. ఇశ్రాయేలులో జరుగుచుండిన ఆరాధనలో పాల్గొనుట నుండి మినహాయింపబడిన వారికి: షండులు మియు అన్యజనులు, ఆయన అదివరకు చేసిన వాగ్దానమును దేవుడు ఇక్కడ పునఃరుక్తము చేయుచున్నాడు (56:4, 5; 62:2ఎ).

"నమ్మదగిన దేవుడు" సత్యసంబంధుడైన దేవుడు అను మాటలు 16వ వచనంలో మాత్రమే కనబడుచున్నవి. "నమ్మకము" (సత్యము)నకు హెబ్రీ భాషలో గల *'amen,* "ఆమేన్" అను పదము ఆయన దేవుడైయున్నాడని సూచించుచున్నది. (ప్రకటన 3:14 చూడుము.) ఆయన, ఆడిన మాట తప్పడు!

## నూతన ఆకాశములు మరియు నూతన భూమి గూర్చి దేవుడు వర్ణించుచున్నాడు (65:17-25)

ఈ వాక్యభాగము 66వ అధ్యాయంలో చిత్రీకరింపబడిన కడపటి తీర్పునకు నాందియై యున్నది. విడుదల మరియు నీతి గూర్చి, 56 మొదలుకొని 66వ అధ్యాయం వరకు ప్రస్ఫుటముగా ప్రబలియున్న ఇతివృత్తముల గూర్చి, దేవుడు చేయుచున్న ముగింపు వ్యాఖ్యానమునకు అది ప్రాతినిధ్యం వహించుచున్నది. ఈ ఆలోచనలు ఈ రోజుల్లో మనకున్నట్లుగానే, యెషయా దినములలో నెలకొని యుండిన విశ్వసనీయతకు కూడ ఒక గొప్ప ప్రోత్సాహముగా ఉండియుండును.

ఇదిగో నేను క్రొత్త ఆకాశమును
క్రొత్త భూమిని సృజించుచున్నాను

మునుపటివి మరువబడును జ్ఞాపకమునకు రావు.
నేను సృజించుచున్నదానిగూర్చి మీరు ఎల్లప్పుడు
హర్షించి ఆనందించుడి
నిశ్చయముగా నేను యెరూషలేమును ఆనందకరమైన
స్థలముగాను
ఆమె ప్రజలను హర్షించువారిగాను సృజించుచున్నాను.
నేను యెరూషలేమునుగూర్చి ఆనందించెదను
నా జనులనుగూర్చి హర్షించెదను
రోదనధ్వనియు విలాపధ్వనియు దానిలో ఇకను వినబడవు.
అక్కడ ఇకను కొద్దిదినములే బ్రదుకు శిశువులుండరు
కాలమునిండని ముసలివారుండరు
బాలురు నూరు సంవత్సరముల వయస్సుగలవారై చనిపోవుదురు
పాపాత్ముడై శాపగ్రస్తుడగువాడు సహితము నూరు
సంవత్సరములు బ్రదుకును
జనులు ఇండ్లు కట్టుకొని వాటిలో కాపురముందురు
ద్రాక్షతోటలు నాటించుకొని వాటి ఫలముల ననుభవింతురు.
వారు కట్టుకొన్న యిండ్లలో వేరొకరు కాపురముండరు
వారు నాటుకొన్న వాటిని వేరొకరు అనుభవింపరు
నా జనుల ఆయుష్యము వృక్షాయుష్యమంత యగును
నేను ఏర్పరచుకొనినవారు
తాము చేసికొనినదాని ఫలమును పూర్తిగా అనుభవింతురు
వారు వృథాగా ప్రయాసపడరు
ఆకస్మికముగా కలుగు అపాయము నొందుటకై పిల్లలను కనరు
వారు యెహోవా చేత ఆశీర్వదింపబడినవారగుదురు
వారి సంతానపువారు వారియొద్దనే యుందురు.
వారికీలాగున జరుగును
వారు వేడుకొనకమునుపు నేను ఉత్తరమిచ్చెదను
వారు మనవి చేయుచుండగా నేను ఆలకించెదను.
తోడేళ్లును గొఱ్ఱెపిల్లలును కలిసి మేయును
సింహము ఎద్దువలె గడ్డి తినును
సర్పమునకు మన్ను ఆహారమగును
నా పరిశుద్ధపర్వతములో అవి హానియైనను నాశన
మైనను చేయకుండును
అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

"ఇదిగో, నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని సృజించుచున్నాను" అని దేవుడు ఒక గంభీరమైన ప్రకటన చేయుచున్నాడు (వచనం 17ఎ). వచనము మొదట్లో వ్రాయబడియున్న "ఇదిగో" అని మాట మొదటి వచనము మొదలుకొని చెప్పబడిన విషయమును నిరూపిస్తూ దానికి తగిన ఆధారాలను చూపించుటకు ఒక ప్రకటనను పరిచయము చేయుచున్నది. అదే మూలము నుండి ఆదికాండము 1:1లో ఉపయోగింపబడినది, "సృజించుట" అను పదము *(bore'),* ఆది యందులి లోకము యొక్క సృష్టిని సూచించుచు ఒక నూతనమైన దానిని ఉనికి లోనికి తెచ్చుటకు దేవుడు కలిగియుండిన తన సంకల్పమును నొక్కిచెప్పుచున్నది. మునుపటివి

"మరువబడును లేక జ్ఞానమునకు రావు" (వచనం 17బి). మెస్సీయా సంబంధిత రాజ్యము నూతనమైనదియు భిన్నమైనదియునై యుండును. హెూమర్ హెయ్‌లీ ఇలా చెప్పుచున్నాడు,

> తొల్లిటి వ్యవస్థ అంతయును, ఒక ప్రత్యేకమైన భౌతిక దేశము మరియు భౌగోళిక ప్రదేశము, జంతువుల బల్యర్పణలు, మరియు శిష్టాచార సంబంధమైన క్రతువులు చేరియుండినదంతయును, సంపూర్తిగా తొలగింపబడి శాశ్వతముగా నిర్మూలింపబడునని బలమైన ఈ భాష నొక్కివక్కాణించుచున్నది.[5]

పౌలు ఇలా చెప్పుచున్నాడు, "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల, వాడు నూతన సృష్టి; పాతవి గతించెను; ఇదిగో, క్రొత్తవాయెను" (2 కొరింథీయులకు 5:17).

పురాతన యెరూషలేమును సాదృశ్యముగా ఉపయోగించును, "... హర్షించి ఆనందించుటకు" దేవుని చేత సృష్టింపబడిన ఒక నూతన "యెరూషలేము"ను యెషయా చిత్రించుచున్నాడు (వచనం 18). ప్రజలు ఆనందించుట మాత్రమే కాదు గాని, దేవుడు కూడా తానే "యెరూషలేమును గూర్చియు, ఆయన (నా) జనుల గూర్చియు ఆనందించవలెనని" ఆశిస్తున్నాడు (వచనం 19ఎ). నూతన యెరూషలేములో "రోదనధ్వని గాని విలాపధ్వని గాని ఉండవు" (వచనం 19బి). శిశువులు కొద్దిదినములే బ్రతికి మరణించుట తొలగింపబడును (వచనం 20), మరియు ఇళ్లలో నుండియు పొలములలోనుండియు వెళ్లగొట్టబడుట గతకాలమందలి గాథయైపోవును (వచనాలు 21–23ఎ). ప్రజలు మరియు వారి సంతానము "యెహోవా చేత ఆశీర్వదింపబడుదురు" (వచనం 23బి). దేవుని పట్టణమందు ఆయనతో సంభాషించునప్పుడు అంతరాయంగాని మాట తడబాటుగాని ఉండదు. వారు ఆయనకు మొరపెట్టక మునుపే లేక వారు యింకా మొరపెట్టుకొనుచున్నప్పుడే ఆయన ప్రజలు విన్నవించుకొను మొరలను ఆలకించి ప్రత్యుత్తమిచ్చునని ఆయన వాగ్దానం చేసియున్నాడు (వచనం 24). అపొస్తలుడైన యోహాను పరలోకము గూర్చి రచించిన వర్ణనను ఇది మనకు గుర్తుచేయుచున్నది (ప్రకటన 21:1–5).

11:6లో, గల అంకురము యొక్క నీతిమంతమైన పరిపాలనకు సంబంధించిన దానిని పోలిన మనఃకల్పన చొప్పున, దేవుని రాజ్యము "తోడేలు," "సింహము," మరియు "సర్పము"నకు సంజ్ఞగా నుండు వాటి చేత కలుగు అపాయములు లేనిదైయుండునని యెషయా చెప్పుచున్నాడు (వచనం 25). ఈ జంతువులు "మనము జీవించుచున్న ఈ లోకములో నున్న, మానవ ప్రవృత్తి లోపల మరియు వెలుపల నున్న, కంటికి కనబడగానే కబళించునవియు, ఆకలితో అలమటించుటనుబట్టి పొంచి తిరుగుచుండునవియు, విషపూరితమైనవియునైన కోణములను సూచించుచున్నవి."[6] "సర్పమునకు మన్ను ఆహారమగును" అను మాటలు ఆదికాండము 3:14కు సంబంధించినవై యున్నవి, "... నీవు బ్రతుకు దినములన్నియు మన్ను తిందువు" అని దేవుడు ఆనాటి సందర్భములో సర్పముతో చెప్పాడు.[7] ఇక్కడ మనము గమనించుచున్న భాష మెస్సీయా సంబంధిత రాజ్యమునకు సంబంధించినదై యున్నది.

---

సూచనలు

[1]నిర్గమకాండము 20:25; ద్వితీయోపదేశకాండము 12:1–7; 27:5, 6; యెహోషువా 8:31 పోల్చి చూడుము. [2]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVar-

sity Press, 1993), 527. [3]Ibid. [4]G. Lloyd Carr, "*meni,*" *Theological Wordbook of the Old Testament,* ed. R. Laird Harris, Gleason L. Archer, Jr., and Bruce K. Waltke (Chicago: Moody Press, 1980), 1:514, Merrill C. Tenney, ed., *The Zondervan Pictorial Encyclopedia of the Bible* (Grand Rapids, Mich.: Regency Reference Library, 1975), 2:108. [5]Homer Hailey, *A Commentary on Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1985; reprint, Louisville, Ky.: Religious Supply, 1992), 519. [6]John N. Oswalt, *The Book Of Isaiah, Chapters 40-66,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 662. [7]Hailey, 521.

---

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

### ❖❖❖ దేవుడు మరియు ఆయన ప్రజలు ❖❖❖
### (అధ్యాయం 65)

దేవుడు గగనము చీల్చుకొని ఆయన శక్తిని ప్రకటించు ఒక గంభీరమైన ప్రదర్శనతో దిగిరావలెనని యెషయా 64:1లో వ్రాయబడియున్నట్లు ఆయనకు ఒక విన్నపము చేయుబడింది. ఇటువంటి విన్నపమునకు దేవుడిచ్చుచున్న ఒక విధమైన ప్రతిస్పందనను 65వ అధ్యాయం మనముందుంచుచున్నది. ఆయన ఇచ్చిన బహుముఖ సమాధానము ద్వారా దేవుడు తన ప్రజలతో పరస్పరము ఎలా ప్రతిస్పందిస్తాడో యను దైవికమైన దృక్పథము స్పష్టముగా కనబడుచున్నది.

*మొదటిదిగా, ఆయన ప్రజలు ఆయనకు మొరపెట్టునప్పుడు ప్రతిస్పందించుటకు దేవుడు ఎల్లప్పుడు సంసిద్ధుడై యున్నాడు.* ఆయన తన ప్రజల యెడల ఎన్నడును స్వార్థాపేక్షగలవాడుగా గాని లేదా ఉదాసీనమైనవాడుగా గాని ఉండడు, కానీ ఆయన గూర్చి ఆలోచన చేయక ప్రార్థించువారి మొరలను ఆలకించుటకు ఆతురతగల హృదయముతో వేచియుంటాడు. "నా యొద్ద విచారణచేయనివారిని నా దర్శనమునకు రానిచ్చితిని; నన్ను వెదకనివారికి నేను దొరికితిని" అని ఆయన చెప్పుచున్నాడు (వచనం 1ఎ) చిత్తశుద్ధితోను, విధేయతతోను కూడినదైయున్న హృదయముతో దేవుని యొద్దకు వచ్చువారు ఏ ఒక్కడును వట్టి చేతులతో వెనుకకు పంపివేయబడడు. దేవుడు వానిని సంతోషముతో స్వాగతించి తన కృపావస్త్రముతో కప్పును.

*రెండవదిగా, ఆయనను వెదకనివారిని ఆయన ఆశీర్వదించడు.* ఆయన వారి ప్రార్థనలకు ఎందుకు జవాబీయలేదు? "నేనున్నాను, ఇదిగో, నేనున్నాను అని నా పేరు పెట్టబడని జనముతో చెప్పుచున్నాను" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 1బి). దేవుని గూర్చిన ఆసక్తి ప్రజల్లో లేదు; వారు ఆయనను యథార్థముగా కోరుకొనలేదు. దేవుడు వారి కొరకు వేచియుండినాడు, కాని వారు ఆయన యొద్దకు రాలేదు. ఒకని హృదయములోనికి ఆయన ఎన్నడును ఆహ్వానింపబడని అతిథిగా ప్రవేశింపడు.

*మూడవదిగా, ఆశీర్వదించవలెనని ఆయన ఎంతగానో ఆశించుచున్నప్పటికిని, అవమానకరమైన అభ్యాసములు ఆయన ఉగ్రతను రెచ్చగొట్టుచున్నవి.* "తమ ఆలోచనల

ననుసరించి చెడు మార్గమున నడచుకొనుచు, లోబడనొల్లని ప్రజలవైపు, దినమంతయు నా చేతులు చాపుచున్నాను. వారు ... నాకు నిత్యము కోపము కలుగజేయుచున్నారు" అని ఆయన చెప్పుచున్నాడు (వచనాలు 2-5ఎ). "వీరు నా నాసికారంధ్రములకు పొగవలెను దినమంతయు మండుచుండు అగ్నివలెను ఉన్నారు" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనం 5బి). వేరు విధమైన ఎటువంటి ప్రతిస్పందన చూపించుటకు ఆయన యొక్క నీతిమంతమైన స్వాభావము ఆయనను నిరోధించుచున్నది.

*నాలుగవదిగా, ఆయన హృదయము ప్రేమతో నిండుగా నిండియున్నప్పటికిని, ఆయన పాపమునకు ఎల్లప్పుడు తీర్పు తీర్చును.* ఆయన పాపమును పట్టించుకొనకుండా ఉండడు లేక దానిని సమర్థించడు. "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు, నా యెదుట గ్రంథములో అది వ్రాయబడి యున్నది, ప్రతికారము చేయక, నేను మౌనముగా ఉండను, కానీ నిశ్చయముగా వారనుభవించునట్లు నేను వారికి ప్రతికారము చేసెదను; నిశ్చయముగా మీ దోషములనుబట్టియు మీ పితరుల దోషములనుబట్టియు – అనగా పర్వతముల మీద ఆ జనులు ధూపమువేసిన దానిని బట్టియు, కొండల మీద నన్ను దూషించిన దానిని బట్టియు, మొట్టమొదట వారి ఒడిలోనే వారికి ప్రతికారము కొలిచి పోయుదును" అని ఆయన చెప్పుచున్నాడు (వచనాలు 6, 7). మనము పాపపు బాటలో పయనించుచునే యుండినట్లయితే ఆయన మనలనుగాని మన పితరులనుగాని మన్నించడు. దేవునికి విరోధముగా తిరుగుబాటు చేయుచు జీవించుచుండువారు ఎట్టకేలకు వారు దాచుకొని కాపాడుకొనుచుండిన పాపమునకు తగిన అదే విధి అనుభవించుదురు.

*ఐదవదిగా, ఆయన ప్రజలు ఆయనకు అమూల్యమైనవారై యున్నారు గనుక, అవసరమైనప్పుడు, ఆయన తన సదుద్దేశములను శేషము ద్వారానైనను సిద్ధింపజేసికొనును.* వారు స్వధర్మమును పరిత్యజించిన అనేకులతో చుట్టుముట్టుకొనబడి యున్నప్పటికిని ఆయన కొద్దిమందినైనా రక్షింస్తాడు. "ద్రాక్షాగెలలో క్రొత్త రసము కనబడునప్పుడు, జనులు, 'అది దీవెనకరమైనది దాని కొట్టివేయకుము' అని చెప్పుదురు గదా? నా సేవకులనందరిని నేను నశింపజేయకుండునట్లు వారినిబట్టి నేనాలాగే చేసెదను. యాకోబు నుండి సంతానమును, యూదా నుండి నా పర్వతమలను స్వాధీనపరచుకొను వారిని పుట్టించెదను; నేను ఏర్పరచుకొనినవారు దాని స్వతంత్రించుకొందురు, నా సేవకులు అక్కడ నివసించెదరు" అని ఆయన సెలవిచ్చాడు (వచనాలు 8, 9). ఆయన సేవకులు అల్పసంఖ్యాకులై అనేకుల దృష్టికి అగుపించక గుప్తముగా ఉండువారైనను దేవుడు వారిని రక్షిస్తాడు.

*ఆరవదిగా, చెడు నడతలోనే స్థిరంగా కొనసాగుచు పశ్చాత్తాపపడుటకు తృణీకరించువారు నాశనము చేయబడుదురు.* "యెహోవాను విసర్జించి నా పరిశుద్ధపర్వతమును మరచి గాదునకు బల్లను సిద్ధపరచువారలారా, అదృష్టదేవికి పానీయార్పణము నర్పించువారలారా, నేను పిలువగా మీరు ఉత్తరమియ్యలేదు, నేను మాటలాడగా మీరు ఆలకింపక, నా దృష్టికి చెడ్డదైనపని చేసితిరి. నాకిష్టము కానిదాని కోరితిరి, నేను ఖడ్గమును మీ అదృష్టముగా నియమించుదును, మీరందరు వధకు లోనగుదురు" అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (వచనాలు 11, 12).

*ఏడవదిగా, విశ్వాసమును పట్టువదలక పట్టుకొని దేవునితో నడచువారికి మహిమాన్వితమైన భవిష్యత్తు కలదు.* ఆయన యెడల విశ్వసనీయులై యుండువారిని దేవుడు

ఎంతో ప్రేమించుచు వారికి సమస్తమును సమకూరుస్తాడు – ఇప్పుడు మాత్రమే కాదు, కానీ మున్ముందున్న రోజుల్లో కూడ. "ఇదిగో, నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని సృజించుచున్నాను; మునుపటివి మరువబడును జ్ఞాపకమునకు రావు. నేను సృజించుచున్నదాని గూర్చి మీరు ఎల్లప్పుడు హర్షించి ఆనందించుడి; నిశ్చయముగా నేను యెరూషలేమును ఆనందకరమైన స్థలముగాను ఆమె ప్రజలను హర్షించువారిని గాను సృజించుచున్నాను. నేను యెరూషలేమును గూర్చి ఆనందించెదను నా జనులను గూర్చి హర్షించెదను; రోదనధ్వనియు విలాపధ్వనియు దానిలో ఇకను వినబడవు" అని అయన సెలవిచ్చుచున్నాడు (వచనాలు 17–19). ఆయన ఏర్పరచుకొనిన ప్రజలకు ఆయన ప్రత్యుత్తరమిచ్చును: "వారికీలాగున జరుగును, వారు వేడుకొనక మునుపు, నేను ఉత్తరమిచ్చెదను; వారు మనవి చేయుచుండగా, నేను ఆలకించెదను" (వచనం 24). దేవుడు సంఘర్షణను మరియు వైరస్యమును తొలగించును, సమస్తమును సంపూర్తియైన సమాధానముతో నెలకొని ఉండు పరిస్థితిని కలుగజేయును: " 'తోడేళ్లును గొఱ్ఱెపిల్లలును కలిసి మేయును, సింహము ఎద్దు వలె గడ్డి తినును; సర్పమునుకు మన్ను ఆహారమగును, నా పరిశుద్ధ పర్వతములో అవి హానియైనను నాశనమైనను చేయకుండును' అని యెహోవా సెలవిచ్చుచున్నాడు" (వచనం 25).

అలాగైతే "దేవుడు తన ప్రజలతో ఎలా సత్సంబంధమును కలిగియుండగలడు?" అనునది లేవదీయబడగల ఒక అతి గొప్ప ప్రశ్నయై యున్నది. సామాన్యమైన నిశ్చయతలతో, ఆయనను ఆరాధించువారి యెడల ఆయన కనుపర్చు ప్రతిస్పందన గూర్చిన అనేక కోణాలు ఈ అధ్యాయంలో పేర్కొనబడినవి లేదా పరోక్షంగా మరొక దానితో కలిపి ప్రస్తావింపబడి యున్నవి. మన ప్రార్థనలకు ప్రత్యుత్తరమీయవలెననే ఆయన ఆశిస్తున్నాడు, కానీ ఆయనను వెదకనివారిని ఆయన ఆశీర్వదించడు. అవమానకరమైన అభ్యాసముల చేత ఆయన ఆగ్రహము రెచ్చగొట్టబడుచున్నది గనుక ఆయన పాపమునకు తీర్పుతీర్చును. ఆయన ప్రేమామయుడే అయినప్పటికిని, పాప జీవితములోనే కొనసాగుచుండువారిని ఆయన నాశనము చేయును. అవసరమైనప్పుడు, తన కార్యమును సిద్ధింపజేసికొనుటకు, ఆయన శేషమునకు పిలుపునిచ్చును; ఆయనయందు నిలిచియుండువారు బంగారు భవిష్యత్తు కలిగియుండునట్లు చూచును.